సాక్షి
వికారాబాద్
గురువారం । 6 । ఏప్రిల్ । 2023




ఉద్యోగాలివ్వాలి
మల్కాపూర్ శివారులోని ఐసీఎల్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. 8లో ▸



చర్యలకు సిఫారసు చేస్తా
కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వైద్యుల తీరుపై ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో ▸



సమస్యల చింత
వారాంతపు సంతలో సౌకర్యాలు లేక వ్యాపారులు, కొనుగోలు దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో ▸



మహనీయుల ఆశయాలను సాధిద్దాం

జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం
- మంత్రి సబితారెడ్డి
- నివాళులర్పించిన మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్
- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ

వికారాబాద్ అర్బన్: మహనీయుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. జయంతి వేడుకల్లో మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మహనీయుల భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ వారి ఆశయాలను కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల రమేశ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జగదీశ్, కార్యదర్శి నర్సింహులు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పుణ్యమాసం..

పరిగి: జగ్జీవన్‌రామ్ దేశ అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని మంత్రి సబితారెడ్డి అన్నారు. పరిగి పట్టణంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ మహనీయుల జయంతి వేడుకలు ఒకే నెలలో ఉండటం ఈ మాసం పుణ్యమాసంగా పరిగణిస్తామన్నారు. సమాజంలో అట్టడుగు వర్గం నుంచి అత్యున్నతస్థాయి వరకు ఎదిగి దేశ ప్రజలకు ఎంతో సేవచేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రాజు, జెడ్పీటీసీ హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, శుభప్రద్‌పటేల్ తదితరులు



పరిగి పట్టణంలోని వేంకటేశ్వర స్వామి టెంపుల్ కాలనీలో పారుతున్న మురుగు

మురుగు నిత్యం..
సమస్య యథాతథం

పట్టణాల్లో పాలన పడకేసింది. కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు ఒకరికొకరు పంచాయితీ పెట్టుకోవటం తప్ప పాలనపై దృష్టి సారించడంలేదు. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారయ్యింది. కాలనీల్లో ఇళ్ల మధ్య, రోడ్లపైనా మురుగు పారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం కొరవడటంతో కిందిస్థాయిలో ఆడిందేఆటలా మారింది. ఫలితంగా కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది.

పట్టణాల్లో కొరవడిన పారిశుద్ధ్యం
- కంపుకొడుతున్న కాలనీలు
- రోగాలబారిన స్థానికులు
- నామ్‌కేవాస్తేగా చెత్త సేకరణ
- శివారుల్లో ఇష్టారాజ్యంగా డంప్
- పట్టించుకోని పాలకవర్గాలు

వికారాబాద్: పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకు అధికమవుతూనే ఉంది. ప్రస్తుతం వరుసగా వర్షాలు కురుస్తుండటంతో సమస్య మరింత తీవ్రరూపం దాలుస్తోంది. పల్లెలు కొంత మెరుగుపడినా పట్టణాలు మాత్రం ఇంకా అధ్వానంగానే దర్శనమిస్తున్నాయి. చాలా వరకు చెత్త సేకరించకుండా ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారు. మరోవైపు సేకరించిన అరకొర చెత్తను ఇష్టారాజ్యంగా డంప్ చేస్తున్నారు. దీంతో పరిసర ఆవాసాల్లో నివసించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో దోమలు, ఈగలు పెరిగి పోయి పరిసర ప్రాంత ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

కానరాని తడి, పొడి చెత్త సేకరణ

రోజూ ఉదయం లేవగానే తడిపొడి చెత్త వేర్వేరుగా వేయాలని మున్సిపాలిటీ వాహనాలతో ఊదరగొడుతున్న యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడంలేదు. తడి, పొడి అంతా ఒకేచోట సేకరించి శివారు ప్రాంతాలకు తరలించి డంప్ చేస్తున్నారు. నిధుల దుర్వినియోగం చేయడం ..లేదంటే ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవటానికే పాలక వర్గాలు పరిమితమవుతుండగా కమిషనర్లు అందినకాడికి దండుకుంటూ చేయాల్సిన పనుల బాధ్యత తమది కానట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ ప్రగతి పేరుతో అప్పుడప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు కార్యక్రమం ముగిసిన వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలను గాలికొదిలేస్తున్నారు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

ఇళ్ల మధ్యే మురుగు

పురపాలక సంఘాల పరిధిలోని చాలా కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. నివాసాల మధ్య మురుగు పేరుకుపోయి పందులు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అయినా ప్రజాప్రతినిధులు అధికారులు చూసిచూడనట్టే వ్యవహరిస్తుండటం గమనార్హం. ఒక్కో మున్సిపాలిటీలో రూ.కోట్లలో నిధులు ఖర్చు చేశామని చెబుతున్నా సమస్యలు మాత్రం అలాగే దర్శనమిస్తున్నాయి. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నాలుగు మున్సిపాలిటీలు ఉండగా చెత్త సేకరణ విధానంలో అన్నింటిలో అస్తవ్యస్తంగానే తయారయ్యింది. అధికారులు చెబుతున్న దానికి వాస్తవ పరిస్థితులకు ఎలాంటి పొంతన కనిపించడంలేదు. తడి, పొడి చెత్త వేరు చేయటం కోసం మున్సిపాలిటీల్లో చెత్త బుట్టలు అందజేస్తున్నప్పటికీ చెత్త వేరు చేసే విషయంలో అవగాహన కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో చెత్తనంత ఒకే చోట పడేస్తున్నారు. గతంలో తాండూరు, పరిగి , వికారాబాద్ మున్సిపాలిటీల్లో కంపోస్టు ఎరువుతయారీ యూనిట్లు నెలకొల్పి కంపోస్టు ఎరువులు తయారు చేశారు. తయారు చేసిన ఎరువును పట్టణ ప్రకృతి వనాల్లో, నర్సరీల్లో పెంచిన మొక్కల కోసం వాడారు. కొద్ది రోజుల పాటు కంపోస్టు ఎరువులు తయారు చేసిన మున్సిపల్ యంత్రాంగం కొద్ది రోజులకే ఆ తతంగం మూలకు పడేశారు.

‘మక్క’కు దిక్కేది?

- జాడలేని కొనుగోలు కేంద్రాలు
- దళారుల పాలవుతున్న దిగుబడులు
- మరోవైపు కలవరపెడుతున్న ధరలు
- అయోమయంలో రైతన్నలు

పెద్దేముల్: మొక్కజొన్న రైతులకు దళారులే దిక్కవుతున్నారు. పంట చేతికి వచ్చినా కొనుగోలు కేంద్రాలు లేక పండించిన పంటను అమ్ముకొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పత్తి, కంది పంటల బదులు పంటల మార్పిడి చేసినా అందుబాటులో మార్కెట్ లేక ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తట్టిపల్లి, మంబాపూర్, పెద్దేముల్, కందనెల్లితండా, జనగాం, ఇందూరు, గాజీపూర్, గోట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో సుమారు 400 ఎకరాలల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. మండలంలో మొక్కజొన్న సాగుకు అనువైన నేలలు ఉండటంతో రైతులు ఏటా సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఎకరా పొలంలో పంట సాగుచేయాలన్నా సుమారు రూ.20 వేల నుంచి రూ.25వేల వరకు ఖర్చు అవుతుందని అంటున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో అందుబాటులో కొనుగోలు కేంద్రం లేక, దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో మద్దతు ధర అందడంలేదని అంటున్నారు. వరి, కంది, పెసర, మినుము పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం అదే విధంగానే మొక్కజొన్నలకు కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. పదేళ్లుగా మండలంలో మక్క సాగు పెరుగుతున్నా మా ర్కెట్‌లేక అవస్థలు తప్పడంలేదని చెబుతున్నారు.

దళారుల రాక

మొక్కజొన్న పంటకు తాండూరు నియోజక వర్గంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల్లేవు. మర్పల్లి, వికారాబాద్, మోమిన్‌పేట ప్రాంతాల నుంచి దళారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వారు చెప్పిందే ధర అని, విధిలేక వారికే విక్రయిస్తున్నామని రైతులు వాపోతున్నారు. క్వింటాలుకు రూ.2.200 విక్రయిస్తున్నామంటున్నారు. క్వింటాలుకు కనీసం రూ.3వేలు వస్తేనే పెట్టిన పెట్టుబడులు వస్తాయని చెబుతున్నారు.

“ కొనుగోలు కేంద్రం లేక..



ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు మార్కెట్ లేక దళారులను ఆశ్రయిస్తున్నాం. దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సివస్తోంది. దీంతో పెట్టుబడులు కూడా రావడంలేదు. ప్రభుత్వం మార్కెట్ ఏర్పాటుతో పాటు మద్దతు ధర కల్పించాలి.

– గురువప్ప, రైతు, పెద్దేముల్

రూ.3వేలు ఇస్తేనే గిట్టుబాటు



కూలీ రేట్లు, ఎరువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నా పంటకు గిట్టుబాటు ధర మాత్రం లభించడం లేదు. మొక్కజొన్నకు క్వింటాలుకు రూ.3వేలు ఇస్తేనే పెట్టిన పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో దళారులకు విక్రయిస్తున్నాం. దీంతో గిట్టుబాటు ధర లభించడంలేదు. వారు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోంది.

– హరిసుధన్‌రెడ్డి, రైతు, మారేపల్లి



పెద్దేముల్‌లో నూర్పిడి కోసం సిద్ధం చేసిన మొక్కజొన్న దిగుబడులు

న్యూస్‌రీల్

పేపర్ల లీకేజీ ప్రతిపక్షాల కుట్ర



మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ : పదో తరగతి పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ ప్రతి పక్షాల కుట్ర అని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పీసీసీచీఫ్ రేవంత్‌రెడ్డి అనుచరులకు ఇందులో ప్రమేయం ఉందని విమర్శించారు. టీఆర్‌ఎస్‌ను ఇరకాటంలో పెట్టాలనే ఉద్దేశంతో లీకేజీకి కుట్ర పన్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చూసి ఓర్వలేక దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రతిపక్ష నాయకులు చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు శివకుమార్ గుప్త, విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్, కౌన్సిలర్ మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం
డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రామ్మోహన్ రెడ్డి

దోమ: గ్రామాలలో పేద కుటుంబాలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు, రామ్మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బొంపల్లిలో చిన్న నర్సింహులు కుమార్తె మనీషా అనారోగ్యంతో మృతి చెందింది. రామ్మోహన్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఎలాంటి కష్టాలు వచ్చినా తమను సంప్రదిస్తే ఆదుకునేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, రాములు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన



అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం దిష్టిబొమ్మతో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో కొనసాగుతున్న నియంత పాలనను అంతమొందించడానికి ప్రతీ బీజేపీ కార్యకర్త పోరాడాల్సిన సమయం ఆసన్నమైనదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బండి సంజయ్ అరెస్ట్, రిమాండ్‌ను నిరసిస్తూ అబ్దుల్లాపూర్ మెట్‌లో బుధవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తప్పుడు కేసులతో బీజేపీని భయపెట్టలేరని హెచ్చరించారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సాయంత్రం వేళ సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, బొడిగ గోవర్ధన్, రామసాని మోహన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా ఇన్‌చార్జ్ రంగా జంగమయ్యగౌడ్, పాపయ్య, మండల ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పరీక్ష బాగారాయలేదని..

- చెరువులో దూకి టెన్త్ విద్యార్థి బలవన్మరణం



రమేశ్ (ఫైల్)

యాలాల: పదో తరగతి తెలుగు పరీక్ష బాగారాయలేదని మనస్తాపానికి గురైన విద్యార్థి చెరువులోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని అగ్గనూరు అనుబంధ మల్‌రెడ్డిపల్లిలో బుధవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ అరవింద్‌కుమార్, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం నాగసముందర్ గ్రామానికి చెందిన మామిళ్ల కిష్టప్ప, మల్లమ్మ దంపతుల రెండో కుమారుడు రమేశ్ (17) చిన్నప్పటి నుంచి మల్‌రెడ్డిపల్లిలోని పెద్దమ్మ అంజిలమ్మ వద్ద ఉంటున్నాడు. అగ్గనూరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న రమేశ్ ఈ నెల 3న జరిగిన తెలుగు పరీక్ష బాగారాయలేకపోయానని స్నేహితులు,తెలిసిన వారి వద్ద వాపోయాడు. మనస్తాపానికి గురై అదే రోజు సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం అగ్గనూరు సమీపంలోని రెడ్డిచెరువులో రమేశ్ మృతదేహాన్ని గమనించిన స్థానికులు యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చారు.మృతదేహాన్ని బయటికి తీసి, తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాలమూరును పూర్తిచేసి తీరుతాం

- ప్రతి ఎకరాకు నీరందిస్తాం
- ప్రతిపక్షాలు కేసులు వేయడం వల్లే ఆలస్యంగా పనులు
- రాజకీయంగా దెబ్బతీసేందుకే లీకుల కుట్ర
- ‘ఆత్మీయ సమ్మేళనం’లో మంత్రి సబితారెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

పరిగి: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి తీరుతామని, కొందరు ప్రతిపక్ష నాయకులు కేసులు వేయడం వల్ల పనుల్లో ఆలస్యం జరుగుతోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. బుధవారం పరిగి పట్టణ కేంద్రంలో నిర్మించనున్న మార్కెట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణ బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. రైతుల సంక్షేమానికి కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. గతంలో ఎరువుల కోసం రైతుల రోజుల తరబడి క్యూలో నిలబడేవారన్నారు. కానీ నేడు రైతుల దగ్గరకే అన్ని చేరుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ప్రతి ఎకరాకు నీరందిస్తున్నారన్నారు. ఇదే తరుణంలో పాలమూరు ఎత్తిపోతల కూడా పూర్తి అయ్యేదని, కానీ కొంత మంది కేసులు వేయడం వల్ల ఆలస్యం అవుతోందన్నారు. ప్రతి నిరుపేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో విద్యనందించాలనే ఉద్దేశంతోనే గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంత నాణ్యమైన విద్యా వ్యవస్థ దేశంలో ఏరాష్ట్రంలోనూ లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే లీక్‌లు చేస్తున్నారన్నారు. నిత్యావసరాల సరకుల ధరలను పెంచి మోదీ ప్రభుత్వం ప్రజలపై భారం వేసిందన్నారు. ఇలా ధరలు పెంచి.. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుంటే పట్టించుకోని బీజేపీ నాయకులు ముందు వాటిపై దృష్టి పెట్టాలని హెచ్చరించారు. 40 ఏళ్లుగా హరీశ్వర్‌రెడ్డి కుటుంబం నియోజకవర్గానికి ఎంతో సేవచేశారన్నారు. అదే తరుణంలో మహేశ్‌రెడ్డికి కార్యకర్తలు అండగా ఉండాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ దేశం మొత్తం సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. సంపద పెంచి ప్రజలకు పంచాలనే నినాదంతో సీఎం ముందుకు వెళ్తున్నారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు ఇబ్బందులు లేకుండా సీఎం కేసీఆర్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పట్టణ అధ్యక్షుడు సంతోష్, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మీర్‌మహ్మద్. ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..



కల్యాణ శోభతో అలరారుతున్న సీతారాములు

కద్లాల్: మండల కేంద్రంలోని విజయగణపతి, సరస్వతీ సహిత సీతారామచంద్రస్వామి ఆలయంలో కొలువైన శ్రీరాముడి కల్యాణ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత రాజమణి, బస్వారాజ్ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారిని, సీతమ్మతల్లిని పట్టువస్త్రాలతో ముస్తాబు చేశారు. శివాచార్య మహాస్వామి బృందం, అంగడిమఠం భువనేశ్వర్ గురువుల వేద మంత్రోచ్ఛారణల మధ్య రాములోరి కల్యాణం జరిపించారు. వేడుకలను తిలకించేందుకు స్థానికులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఇంటి పన్నుపై 5శాతం రాయితీ

కొడంగల్‌: మున్సిపల్‌ పరిధిలో ఈ నెల 30వ తేదీలోపు ఇంటి పన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ పొందవచ్చని కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సీడీఎంఏ సర్క్యులర్‌ విడుదల చేసినట్లు తెలిపారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరపు ఇంటి పన్నుకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. పాత బకాయిలు ఉంటే మొత్తం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పాత బకాయి చెల్లించిన తర్వాతే ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై 5శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని కొడంగల్‌ మున్సిపల్‌ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్‌ కోరారు.

క్రికెట్‌ విజేత తాండూరు జట్టు



విజేత జట్లకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్‌: మండలంలోని సంగెంకలాన్‌ గ్రామంలో బీఆర్‌ఎస్‌ బీసీ సెల్‌ మండల అధ్యక్షుడు ఆర్‌సీ గౌడ్‌ తాతా లోకయ్యగౌడ్‌ స్మారక క్రికెట్‌ టోర్నమెంట్‌ బుధవారంతో ముగిసింది. గెలుపొందిన జట్లకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బహుమతులు అందజేశారు. విజేతగా నిలిచిన తాండూరు జట్టుకు రూ. 30 వేలు, రన్నర్‌ జట్టు సెంగెంకలాన్‌కు రూ.15 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, టోర్నీ నిర్వాహకులు రాజేందర్‌రెడ్డి, శ్రీను, గైబప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు అండగా ఉంటామని డీసీసీబీ చైర్మన్‌ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పుట్టపహడ్‌ గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో లైన్‌మెన్‌ ముకుందరెడ్డి మృతిచెందారు. బుధవారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి, రాంలాల్‌, రవీందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల గొడవ

శంకర్‌పల్లి: ఇద్దరు పాత నేరస్తుల మధ్య గొడవ హత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటన మండల పరిధిలోని మహారాజ్‌పేట్‌ గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గోపులారం గ్రామానికి చెందిన కృష్ణ మద్యం మత్తులో రాత్రి 10.30గంటలకు మహారాజ్‌పేట్‌ గ్రామానికి చెందిన మంజుల ఇంటివద్దకు వెళ్లి గొడవకు దిగాడు. వీరిద్దరూ కలిసి గతంలో పలు చోరీలకు పాల్పడ్డారు. గొడవ పెద్దగా మారడంతో మంజుల భర్త శ్రీనివాస్‌, కుమారులు సంజయ్‌, వంశీ కృష్ణపై కర్రలతో దాడి చేశారు. కూరగాయల కత్తితో గొంతు కోశారు. గమనించిన గ్రామస్తులు వెంటనే బాధితుడిని 108 వాహనంలో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కృష్ణపై సంగారెడ్డి, పటాన్‌చెరు, వికారాబాద్‌ పీఎస్‌లలో దొంగతనాల కేసులు ఉన్నాయి. 2019లో పీడీ యాక్ట్‌ నమోదు చేయడంతో జైలుకు వెళ్లి వచ్చాడు. కాగా హత్యాయత్నానికి పాల్పడిన శ్రీనివాస్‌, సంజయ్‌, వంశీలపై కేసు నమోదు చేశామని శంకర్‌పల్లి సీఐ వి.ప్రసన్న కుమార్‌ తెలిపారు.



యాలాలలో కేసీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నేతలు



దౌల్తాబాద్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

‘బండి’ అరెస్టుపై నిరసన వెల్లువ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ నేతలు బుధవారం ఆందోళనకు దిగారు. సీఎం కేసీఆర్‌, ప్రభుత్వ దిష్టి బొమ్మలను దహనం చేశారు. అరెస్టు అప్రజాస్వామికమని పలువురు పేర్కొన్నారు. వెంటనే బండి సంజయ్‌ని విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. పలు మండలాల్లో పోలీసులు బీజేపీ నాయకులను అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. – సాక్షి నెట్‌వర్క్‌



తాండూరులో కేసీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు



తాండూరు పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు



కుల్కచర్లలో సీఎం కేసీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు



పెద్దేముల్‌: పోలీసుల అదుపులో బీజేపీ శ్రేణులు



ధారూరు: పోలీసుల అదుపులో బీజేపీ నేతలు

‘ప్రైవేటు’ కోసమేనా?

- పేపర్‌ లీకేజీ వ్యవహారంలో పోలీసుల వివరాలపై సర్వత్రా సందేహాలు
- బందెప్ప, సమ్మప్పలు ఎవరి కోసం ఈ చర్యకు పాల్పడ్డారనేది చెప్పని వైనం
- ప్రైవేటు స్కూళ్లతో ఆ ఇద్దరి డీల్‌?

తాండూరు: ప్రైవేటు విద్యాసంస్థల కోసమే తాండూరులో పదో తరగతి పరీక్ష ప్రశ్న పత్రం లీక్‌ చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఉత్తమ ఫలితాలు సాధించి విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రైవేటు పాఠశాలలు అక్రమాల బాట పట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్నేళ్లుగా పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్న పత్రాలను బయటకు తెచ్చేందుకు కొందరు సిండికేట్‌గా ఏర్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో భాగంగానే పలు ప్రైవేటు పాఠశాలలు ఉపాధ్యాయులతో కుమ్మక్కై పేపర్‌ బయటకు తెప్పించి బుక్‌, అండ్‌ జిరాక్స్‌ సెంటర్‌లో జవాబులను తయారు చేసిన అక్కడి నుంచి పరీక్ష కేంద్రాలను పంపిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందుకోసం ఒక్కో పాఠశాల రూ.50 వేల నుంచి రూ.లక్ష చెల్లించేందుకు ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే పేపర్‌ లీకేజీ కేసులో జైలులో ఉన్న ఉపాధ్యాయులు బందెప్ప, సమ్మప్ప చిట్టీల కోసమే పేపర్‌ లీక్‌ చేశారని పోలీసులు చెబుతున్నా.. ఇందులో ప్రైవేటు యాజమాన్యాల పాత్రను కొట్టిపారేయలేమనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

స్థానికులకూ ఉద్యోగాలు ఇవ్వాలి



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు

- అందుకోసం పోరాటం చేస్తా
- ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్‌: మల్కాపూర్‌ శివారులోని ఐసీఎల్‌ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని, లేకుంటే పోరాటం చేస్తానని ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సంగెంకలాన్‌, మల్కాపూర్‌, కోత్లాపూర్‌, కోటబాసుపల్లి, ఐనెల్లి, సిరిగిరిపేట్‌, చెంగోల్‌ గ్రామాల్లో పల్లె పల్లెకూ పైలెట్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే అక్కడి వారు కూడా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. పల్లె పల్లెకూ పైలెట్‌ కార్యక్రమం ముగిసిన తర్వాత మండలంలోని సిమెంట్‌ ఫ్యాక్టరీల్లో స్థానిక యువతకు ఉద్యోగాల కోసం పోరాటం చేస్తానన్నారు. అవసరమైతే ఫ్యాక్టరీకి తాళాలు కూడా వేస్తామని హెచ్చరించారు. గ్రామాల పర్యటనలో తన దృష్టికి వస్తున్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి రూ. 50లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులు వెచ్చించి మూడు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచులు సాయిలు, నాగార్జున, స్వప్నజ్యోతి, నాయకులు ఉమాశంకర్‌, రాంలింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, శకుంతల, ఆర్‌సీ గౌడ్‌, రాకేష్‌గౌడ్‌, జగన్‌, రాజేందర్‌రెడ్డి, పీ సందీప్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మొగులప్ప పాల్గొన్నారు.

నీటి సమస్యను పట్టించుకోరా?

- మరమ్మతులకు నోచుకోని పైప్‌లైన్‌
- 22 రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా
- ఇబ్బంది పడుతున్న జనం



మరమ్మతులకు నోచుకోని పైప్‌లైన్‌ ఇదే

ధారూరు: పంచాయతీ పరిధిలోని 6వ వార్డులో 22 రోజుల నుంచి మిషన్‌ భగీరథ తాగునీటి సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓల్డ్‌ సివిల్‌ ఆసుపత్రి పక్కనే ఉన్న మిషన్‌ భగీరథ ట్యాంకు వాల్వ్‌ వద్ద పైప్‌లైన్‌ జాయింట్‌ విడిపోయింది. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యను ప్రజలు సర్పంచ్‌ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై సర్పంచ్‌ చంద్రమౌళిని వివరణ కోరగా పైప్‌లైన్‌ వాల్వ్‌ వద్ద జాయింట్‌ విడిపోవడం వల్లే నీటి సరఫరా ఆగిందన్నారు. మెకానిక్‌ రాకపోవడం వల్ల రానందున మరమ్మత్తులు చేయించలేకపోయామని తెలిపారు. రెండు రోజుల్లో తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని సర్పంచ్‌ తెలిపారు.

మైనింగ్‌ పనులు నిలిపేయండి

- లేదంటే ఆందోళన ఉధృతం
- జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు ఆచారి



సాకిబండ తండా వాసులతో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: సాకిబండ తండా సమీపంలో చేపట్టిన మైనింగ్‌ పనులను వెంటనే నిలిపివేయాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు ఆచారి హెచ్చరించారు. బుధవారం ఆయన తండావాసులతో కలిసి మైనింగ్‌ పనులు చేపడుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఏళ్ల నుంచి అక్రమంగా మైనింగ్‌ చేపడుతున్నారని ఆరోపించారు. ఈ పనులతో తండా వాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులను నిలిపి వేయాలని ఆందోళన చేపడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వెళ్లిబుచ్చారు. మైనింగ్‌ యాజమాన్యానికి ఆమనగల్లు పోలీసులు భద్రత కల్పిస్తూ ఆందోళన చేస్తున్న గిరిజనులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకుల ప్రోద్బలంతో, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ సహకారంతో ఈ పనులు నడుస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా పనులను నిలిపేయాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, తండా వాసులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలకు సిఫారసు చేస్తా

- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- కొడంగల్‌ ప్రభుత్వాస్పత్రి సందర్శన
- సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం
- వైద్య విధాన పరిషత్‌కు ఫిర్యాదు చేస్తానని వెల్లడి



డయాలసిస్‌ పేషెంటుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్‌: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వైద్యుల తీరుపై ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు సక్రమంగా హాజరుకాని వైద్యులపై వైద్య విధాన పరిషత్‌ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. ఇక్కడి సమస్యలను తెలుసుకున్నారు. వైద్యులు విధులకు సక్రమంగా రావడం లేదని రోగులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఆగ్రహించిన ఆయన విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే రోగులకు సరైన వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. అనంతరం కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న రోగులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న నర్సులతో మాట్లాడారు. సిబ్బంది వివరాలు, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్ట్‌ వైద్యులు నహిదా, సాకేత్‌ మాత్రమే విధుల్లో ఉండడం, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మూర్తి, రెగ్యులర్‌ వైద్యురాలు వీణ విధులకు రాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని మండిపడ్డారు. విధులకు డుమ్మా కొట్టిన వైద్యులపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తానని పేర్కొన్నారు. రోగులకు సరైన వైద్యం అందేలా చూడాలని విధుల్లో ఉన్న వైద్యులకు సూచించారు.

వంతుల వారీగా విధులకు..

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అవస్థలు తప్పడం లేదు. వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కారనే అపవాదు ఉంది. గత నెలలో కలెక్టర్‌ నారాయణరెడ్డి కొడంగల్‌ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అయినా డాక్టర్లలో మార్పు రావడం లేదు. వైద్యులు ఆస్పత్రికి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్‌ వైద్యులు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తు రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న రెగ్యులర్‌ వైద్యులు విధులకు ఎందుకు రావడం లేదని రోగులు ప్రశ్నిస్తున్నారు.

డాక్టర్లు రావడం లేదు



ఆరోగ్యం సరిగ్గా లేక కొడంగల్‌ ప్రభుత్వాస్పత్రికి వస్తే వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. నర్సులు చిట్టీలు రాసి మందులు తీసుకోమని చెబుతున్నారు. పేదలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్‌ 50 పడకల ఆస్పత్రిని కట్టించారు. అయితే ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పేదలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలి.

– వెంకటయ్య, కొడంగల్‌

నడుస్తున్న రైలుకు ఎదురెళ్లి..

యువకుడి బలవన్మరణం

శంకర్‌పల్లి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు నడుస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పత్తేపురం గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మహాలింగపురం గ్రామానికి చెందిన రమేశ్‌(28) పెయింటింగ్‌ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. దీంతో ఉదయం పంచాయితీ పెడతామని కుటుంబీకులు హెచ్చరించారు. ఆందోళన చెందిన రమేశ్‌ బుధవారం ఉదయం 9.30గంటల ప్రాంతంలో పత్తేపురం శివారులోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలుకు ఎదురుగా వెళ్లాడు. రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వికారాబాద్‌ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపులో పడి వ్యక్తి మృతి

కొత్తూరు: ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన దానగల్ల పోచయ్య(62) మండలకేంద్రంతో పాటు ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న ఓ గోదాం క్వాటర్స్‌ వద్ద పాత సామాన్లు(కాగితాలు, ఇనుప వస్తువులు) సేకరించి విక్రయిస్తూ అక్కడే నిద్రిస్తున్నాడు. కాగా ఈ నెల 4న క్వాటర్స్‌ వద్దకు వచ్చి భోజనం చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకునే క్రమంలో పక్కనే ఉన్న నీటిసంపులో పడిపోయాడు. రాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. క్వాటర్స్‌లో నివాసం ఉండేవారు బుధవారం ఉదయం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌ రెడ్డి



బ్యాటింగ్‌ చేసి క్రికెట్‌ పోటీలను ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్‌ ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు మార్గాల వైపు వెళ్ల రాదన్నారు. తమ భవిష్యత్తుకు ఉపయోగపడే వాటిపై దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ శిరీష, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌ నాయక్‌, బ్లాక్‌ టు అధ్యక్షుడు భరత్‌ కుమార్‌, ఎంపీటీసీ ఆనందం, నాయకులు పెంటయ్య, జగన్‌, రామకృష్ణారెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు సహకరించాలి



మాట్లాడుతున్న ఏసీపీ కుషాల్కర్‌

షాద్‌నగర్‌: హనుమాన్‌ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని షాద్‌నగర్‌ ఏసీపీ కుషాల్కర్‌ అన్నారు. బుధవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. హనుమాన్‌ జయంతి ఉత్సవాలను కలిసి కట్టుగా జరుపుకోవాలని సూచించారు. శోభాయాత్ర సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం నిర్వహించే శోభాయాత్రకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు. నిర్ణీత సమయంలో శోభాయాత్రను ప్రారంభించి అర్ధరాత్రి లోపు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ నవీన్‌కుమార్‌, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్‌, వివిధ పార్టీ నేతలు పాల్గొన్నారు.

పీస్‌ కమిటీ సమావేశం

శంషాబాద్‌: పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్‌ ఏసీపీ భాస్కర్‌ సూచించారు. రంజాన్‌, హనుమాన్‌ శోభాయాత్ర, గుడ్‌ఫ్రైడే సందర్భంగా బుధవారం ఏసీపీ కార్యాలయంలో అన్నివర్గాల నేతలతో శాంతియుత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరికి ఇబ్బందులు కలిగించకుండా ర్యాలీలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌ గుప్తా, కౌన్సిలర్‌ జహంగీర్‌ఖాన్‌, సుల్తాన్‌పల్లి సర్పంచ్‌ దండు ఇస్తారి, నాయకులు అంజద్‌, నజీర్‌ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌: హనుమాన్‌ శోభాయాత్ర నేపథ్యంలో రాజేంద్రనగర్‌ డివిజన్‌ డీసీపీ కార్యాలయంలో బుధవారం పీస్‌ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా ప్రాంతాల్లోని మత పెద్దలు, దేవాలయ, ప్రార్థన మందిరాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక రి పండుగలను ఒకరు గౌరవించుకుంటూ ఆనందోత్సవాల మధ్య పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. శోభాయాత్ర నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్‌ డివిజన్‌ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు



నిందితుల వివరాలు తెలుపుతున్న ఏసీపీ గంగాధర్‌

రాజేంద్రనగర్‌: జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన 15 రోజులకే దొంగతనానికి పాల్పడ్డ ఓ అంతర్రాష్ట్ర సెల్‌ఫోన్‌ దొంగను రాజేంద్రనగర్‌ సీసీఎస్‌, రాజేంద్రనగర్‌ పోలీసులు సంయుక్తంగా పట్టుకుని అతడి వద్ద నుంచి 15 లక్షల రూపాయల విలువ చేసే సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్‌ ఏసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గంగాధర్‌ వివరాలను వెల్లడించారు. కర్నూల్‌ జిల్లా, చదువుల రామయ్య కొట్టాలు ప్రాంతానికి చెందిన కొమ్ము వంశీకృష్ణ(29) ఆటో డ్రైవర్‌. ఇతడు సెల్‌ఫోన్‌ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడతాడని.. కర్నూల్‌, తిరుపతి, గద్వాల్‌, గుత్తి, అనంతపూర్‌ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఆరు కేసుల్లో నిందితుడని చెప్పారు. గత నెల 23వ తేదీన రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని 122 పిల్లర్‌ వద్ద ఉన్న లాట్‌ మొబైల్‌ దుకాణంలో జొరబడి యాపిల్‌–12 ఫోన్‌లు నాలుగు, గెలాక్సీ సామ్‌సంగ్‌ ఫోన్‌లు 8, వన్‌ ప్లస్‌ ఫోన్‌లు ఏడు, ఒప్పో, వివో ఫోన్‌లను దొంగిలించాడు. మొత్తం 21 ఫోన్‌ల విలువ 15,38,000 ఉంటుందని దుకాణం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనం చేసిన వాటిలో ఒక ఫోన్‌ను తనకు తెలిసిన బంధువుకు విక్రయించాడు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసులు బుధవారం ఉదయం నిందితుడిని పట్టుకొని అతడి వద్ద నుంచి 15 సెల్‌ఫోన్‌లను, 8,716 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.